క్లుప్తంగా

రైతాంగ వారోత్సవాలు



మాట్లాడుతున్న రెహమాన్

మునిపల్లి(అందోల్): మండలంలోని బుదేరాలో రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎంఏ రెహమాన్ ప్రారంభించారు. ఈ నెల 17వ తేదీ వరకు వారోత్సవాలు కొసాగుతాయన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేసేందుకు సీపీఐ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి, గంగయ్య, వెంకట్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై వినతి



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

రాయికోడ్(అందోల్): మండల కేంద్రంలో నెల కొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు శుక్రవారం ఎంపీడీఓ ఎంఎం షరీఫ్‌నకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కావున తాగునీటిని అంతరాయం లేకుండా సరఫరా చేసేలా చూడాలని విన్నవించారు.

ఇసుక ఫిల్టర్ల కూల్చివేత



ఇసుక ఫిల్టర్లను కూల్చివేస్తున్న అధికారులు

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని బ్యాతోల్, ఎర్దనూర్ శివారులలో కృత్రిమ ఇసుకను తయారు చేస్తున్న అక్రమ ఫిల్టర్లను రెవెన్యూ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. ఈ సందర్భంగా గిర్దావర్ రంగయ్య మాట్లాడుతూ తహసీల్దార్ రవికుమార్ ఆదేశాల మేరకు మండలంలోని ఎర్దనూర్, బ్యాతోల్ శివారులలో కృత్రిమ ఇసుక తయారు చేస్తున్న అక్రమ ఫిల్టర్లను క్రేన్ సహాయంతో కూల్చి వేసినట్లు వివరించారు. అలాగే ఇసుకను తరలిస్తున్న లారీలను పట్టుకుని సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఇసుక ఫిల్టర్లు నిర్వహించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంట రుణాల రెన్యువల్‌కు తప్పని తిప్పలు



బ్యాంకు ఎదుట పాసుపుస్తకాలు పెట్టిన రైతులు

నారాయణఖేడ్: పంట రుణాల రెన్యువల్ కోసం రైతులు గ్రామాల నుంచి భారీగా తరలి వస్తున్నారు. రైతులు రద్దీతో పాటు బ్యాంకులో పనులు ఆలస్యంగా చేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఖేడ్ మంజీరా గ్రామీణ బ్యాంకు ఎదుట శుక్రవారం ఉదయం బ్యాంకు తెరవకుముందే రైతులు బ్యాంకు ఎదుట పాసుపుస్తకాలను వరుస క్రమంలో ఉంచారు. సిబ్బంది కొరత, పనులు ఆలస్యంగా చేయడం కారణంగా ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు వాపోయారు.

పంట నష్టపరిహారం అందించండి



కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నియోజకవర్గంలో పంటలకు నష్టం వాటిల్లిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు కలెక్టర్ ప్రావీణ్యను సంగారెడ్డి కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందించారు. నియోజకవర్గంలో 5 వేల ఎకల్లో వివిధ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. మంజీరాలోకి వరద ఉధృతి కారణంగా మంజీరా బ్యాక్ వాటర్ కారణంగా పంటలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. కావున పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.15 వేల చొప్పున సహాయం అందించి ఆదుకోవాలని కోరారు.

దారులు ఛిద్రం.. జర భద్రం

- అధ్వానంగా మారిన ఆర్‌అండ్‌బీ రోడ్లు
- పూర్తిగా ధ్వంసమైన ప్రధాన రహదారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



పస్తాపూర్ చౌరస్తాలో రోడ్డుపై ఏర్పడిన గుంతలు



అల్లీపూర్ దర్గా సమీపంలో రోడ్డుపై నిలిచిన నీరు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని బీటీ రోడ్లు పూర్తిగా ఛిద్రమయ్యాయి. పలు చోట్ల కంకర తేలి అధ్వానంగా తయారయ్యాయి. ప్రధానంగా ఆర్‌అండ్‌బీ రహదారులు దెబ్బతిని రోడ్లపై గుంతల పడి నీరు నిల్వడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు వరదలు వచ్చి ప్రధాన రహదారులు ధ్వంసం కావడంతో రోడ్లపై ప్రయాణించేందుకు వాహనదారులు భయాందోళనకు గురువుతున్నారు. రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో బైక్‌లు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నట్లు వాపోతున్నారు. ప్రస్తుతం పట్టణంలో ఏ రోడ్డు చూసిన ఎక్కడో చోట గోతులు దర్శనమిస్తున్నాయి. పట్టణం నుంచి వెళ్లే జాతీయ రహదారి అల్లీపూర్ దర్గా సమీపంలో దారుణంగా తయారైంది. రోడ్డుపై వర్షపు నీరు నిలవడంతో మట్టి రోడ్లను తలపిస్తుంది. కొద్దిపాటి వర్షానికి కుంటలా మారుతోంది. వర్షపు నీరు వెళ్లేందుకు దారిలేక రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. ఎక్కడో గుంత ఉందో తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురువుతున్నారు. పస్తాపూర్ చౌరస్తా నుంచి ఝరాసంగానికి వెళ్లే రోడ్డు మధ్యలో సైతం పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు మధ్యలో పడిన గుంతలు కనిపించడం లేదు. దీంతో దగ్గరకు వచ్చే వరకు గుర్తించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు సైతం గుంతలమయంగా మారిన రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు నిర్వహించడం లేదు. ప్రమాదాలు జరిగిన తర్వాత హడావుడి చేసే అధికారులు.. ముందస్తు నివారణ చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుపై గుంతలను పూడ్చి మరమ్మతులు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు మరింత విస్తృతం

టెలికాం బోర్డు నూతన సభ్యుడు వైజ్యనాథ్



వైజ్యనాథ్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ నేత శుక్లవర్ధన్‌రెడ్డి

జహీరాబాద్: జిల్లాలో బీఎస్‌ఎన్‌ఎల్ సంస్థ సేవలను మరింత విస్తృతం చేస్తానని నూతన టెలికాం బోర్డు సభ్యుడు వైజ్యనాథ్ అన్నారు. శుక్రవారం అతిథి ఇన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జహీరాబాద్‌కు పదవిని కేటాయించడం సంతోషకరమన్నారు. మారుమూల ప్రాంతాలకు సంస్థ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు అవసరమైన చోట టవర్ల ఏర్పాటు చేస్తామన్నారు. టెలికాం సంస్థ సెల్‌ఫోన్ సేవలను మరింత విస్తృతపర్చే నిమిత్తం ఆఫర్లను ప్రకటించిందని, కావున బీఎస్‌ఎన్‌ఎల్ సేవలను వినియోగించుకోవాలన్నారు. ఈ మేరకు ఎంపీ సురేష్‌శెట్కార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పలువురు కాంగ్రెస్ నాయకులు ఆయనను శాలువా, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శుక్లవర్ధన్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్‌గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ కాశీనాథ్

జహీరాబాద్: మండలంలోని రాయిపల్లి(డి) క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను శుక్రవారం రూరల్ ఎస్‌ఐ కాశీనాథ్ ప్రారంభించారు. ప్రమాదాల నివారణకు గాను హైమాస్ట్ లైట్ల ఏర్పాటు కోసం సామాజిక సేవకుడు ఆయిదాల సునీల్ ఆధ్వర్యంలో గ్రామస్తులు డెక్కన్ టోల్‌వేస్ సంస్థ, ఎన్‌హెచ్‌ఏఐ సంస్థలను ఆశ్రయించారు. దీంతో వారు ముందుకు వచ్చి అవసరమైన నిధులను కేటాయించారు. ఇందుకు గాను ఆయా సంస్థల ప్రతినిధులు నాగరాజు, కోటేశ్వరరావు, రామకృష్ణలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శేఖర్, రవికుమార్, సంజీవ్, పెంటయ్య, సంజీవరెడ్డి, అనంత్‌రామ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

ఏఈఈ మధుసూదన్‌రెడ్డి



సదాశివపేట(సంగారెడ్డి): అప్రమత్తతతోనే విద్యుత్ ప్రమాదాలు అరికట్టవచ్చని ఏఈఈ మధుసూదన్‌రెడ్డి శుక్రవారం తెలియజేశారు. వర్షాకాలంలో ఈదురుగాలులకు విద్యుత్ తీగలు తెగి పడిపోతుంటాయని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే వర్షాకాలంలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలు, ఇతర పరకరాలను తడి చేతులతో పట్టుకోవద్దన్నారు. అంతేకాకుండా ఇంటి పరిసరాల్లో ఇనుప, సిమెంట్ రాడ్లు, టీన్ షీట్లు వంటివి బహిరంగ ప్రదేశాల్లో ఉంచవద్దన్నారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగితే వెంటనే 8712473178, 8712473153 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. వర్షాకాలంలో ఇంటిలో ఫ్యూజ్ లైన్లు సరిగా ఉన్నాయో లేదో సరి చూసుకోవాలన్నారు. తడి బట్టలు. తడి, చేతులతో విద్యుత్ తీగలు, స్విచ్‌లను తాకవద్దన్నారు. వర్షాకాలంలో మోటార్ వాడకం తగ్గించాలని సూచించారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి 8712473178, 8712473153నంబర్లను సంప్రదించాలని ఏఈఈ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

హనుమాన్ ముందు వానరం



జహీరాబాద్: పట్టణంలోని మహీంద్ర కాలనీ సమీపంలోని కొత్త కాలనీలోఉన్న హనుమాన్ మందిరంలోకి శుక్రవారం ఓ వానరం వచ్చింది. పూజల అనంతరం విగ్రహం ఎదురుగా కొద్ది సేపు కూర్చుంది. అనంతరం పక్కనే ఉన్న సుబ్రమణ్య స్వామి విగ్రహం వద్ద కొద్దిసేపు కూర్చుని, ఆ తర్వాత విగ్రహం వద్ద ఉన్న ప్రసాదాన్ని తీసుకుని వెళ్లిపోయినట్లు భక్తులు పేర్కొన్నారు.

13న లోక్ అదాలత్

జహీరాబాద్ టౌన్: పట్టణంలో ఈ నెల 13న నిర్వహించే జాతీయ మెగాలోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని రూరల్ ఎస్‌ఐ కాశీనాథ్ ఓ ప్రకటనలో కోరారు. లోక్‌అదాలత్‌లో క్రిమినల్ కంపౌండబుల్, సివిల్ తగాదా, ఆస్తి విభజన, కుటుంబ పరం, వైవాహిక జీవితం, బ్యాంక్ రికవరీ, విద్యుత్ దొంగతనం, చెక్‌బౌన్స్‌లను రాజీమార్గంలో పరిష్కరించుకోవచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కేసుల్లో రాజీ కావాలనుకుంటే పోలీసు అధికారులను సంప్రదించాలని కోరారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. ఈ మేరకు స్థానిక ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం గురువారం నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో ఏడుగురిని పట్టుకున్నట్లు చెప్పారు. వీరిని శుక్రవారం సంగారెడ్డి కోర్టు లో హాజరుపర్చగా ఆరుగురికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి జరిమానా, ఒకరికి రూ.1,500 జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ **వీధి కుక్కలతో బెంబేలు**



జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం పట్టణ పరిధిలోని వావిలాలలో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని స్థానిక ప్రజలు ఆందోళన చెదుతున్నారు. నిత్యం గుంపులు గుంపులుగా వీధుల్లో కుక్కలు సంచరిస్తూ దాడులకు తెగబడుతున్నాయని వాపోతున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు ఒంటరిగా కనిపిస్తే దాడి చేస్తున్నాయన్నారు. పలుమార్లు చిన్నారులపై దాడులు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయన్నారు. రాత్రి సమయాల్లో పెద్దపెద్ద అరుపులతో నిద్రపోకుండా చేస్తున్నాయన్నారు. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకొని వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

◆ **నేడు దయల్ యువర్ డీఎం**

నారాయణఖేడ్: ఖేడ్ ఆర్టీసీ డిపోలో శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. ప్రజలు, ప్రయాణికులు ఆర్టీసీ సమస్యలు, అవసరాలు, మెరుగైన సేవలకు సంబంధించి నంబర్.9959223170కు ఫోన్ చేసి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

◆ **బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్..**

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండల పరిధిలోని చింతకుంట సమీపంలో ఎదురెదురుగా బైక్, ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. జోగిపేట ఎస్‌ఐ పాండు తెలిపిన వివరాల ప్రకారం.. అందోల్‌కి చెందిన కొత్తగొల్ల శ్రీనివాస్, ఫైజాబాద్‌కి చెందిన మరో వ్యక్తి గొల్ల నర్సింలుతో కలిసి బైక్‌పై చింతకుంటకు వెళ్తుండగా రైస్‌మిల్ సమీపంలో ట్రాక్టర్ ఢీకొట్టింది. డ్రైవర్ బన్సిలాల్ అజాగ్రత్తతో బైక్‌ను ఢీకొట్టినట్లు బాధితులు చెబుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

◆ **రూ.200 కోట్లతో ప్రత్యేక తాగునీటి పథకం: జగ్గారెడ్డి**

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: మిషన్ భగీరథ తాగునీటి సరఫరాతో సంబంధం లేకుండా స్థానిక పట్టణానికి మంజీరా నీటిని నేరుగా సరఫరా చేసేలా ప్రత్యేక తాగునీటి పథకానికి రూపకల్పన చేస్తున్నామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డితో పాటు సమీపంలోని కల్పగురు, కులబ్ గురు, తాళ్లపల్లి, గంజిగూడెం, ఇరిగిపల్లి, కోత్లపూర్, ఫసల్‌వాది తదితర గ్రామాల వాసులకు రానున్న 50 ఏళ్ల అవసరాలకు సరిపడా నీటిని సరఫరా చేసేలా ఈ పథకానికి పబ్లిక్‌హెల్త్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా అంచనాలు రూపొందిస్తున్నామన్నారు. ఇందుకోసం రూ.200 కోట్లతో కొత్తగా ఫిల్టర్‌బెడ్, ఇంటెక్‌వెల్ వంటి నిర్మాణాలుంటాయని తెలిపారు. పండగ సమయంలో రోజుకు రెండు పూటల నీటి సరఫరా చేసేలా ఈ పథకాన్ని డిజైన్ చేస్తామన్నారు.

◆ **ఏచూరికి ఘన నివాళి**



నారాయణఖేడ్: నియోజకవర్గంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఏచూరి సీతారాం ప్రథమ వర్ధంతి నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఏచూరి స్ఫూర్తితో యువత ఉచిత విద్య, వైద్యం కోసం పోరాడాలని కోరారు. కార్యక్రమంలో ఖేడ్ డివిజన్ కార్యదర్శి రమేష్, నాయకులు సంతోష్, కాన్షీరాం, రఘు, స్వరాజ్, చింటు, అశోక్ పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చండి

- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్
- భూములు కోల్పోతున్న రైతులతో కలిసి కలెక్టర్‌కు వినతి



నిర్వాసిత రైతులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

సంగారెడ్డి : రీజనల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) నిర్మాణంతో నిరుపేద రైతులే భూములు కోల్పోతున్నారని వెంటనే ఈ అలైన్‌మెంట్‌ను మార్చి పేద రైతులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గిర్మాపూర్, అలియాబాద్, మారేపల్లి, మాచేపల్లి, గంగారం, శివన్నగూడెం, రాంపూర్ తండా గ్రామాలకు చెందిన నిర్వాసిత రైతులతో జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ..ఈ రోడ్డునిర్మాణంతో చిన్న, సన్నకారు రైతులు రోడ్డున పడుతున్నారన్నారు. ఈ నిరుపేద రైతులు తమ భూములు కోల్పోతే వారికి జీవనం కష్టమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సీడీసీ మాజీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, నాయకులు మాణిక్‌ప్రభు, రుక్మొద్దీన్, గోవర్ధన్‌రెడ్డి, వినోద్, రాజు, ఆంజనేయులు తదితరులున్నారు.

కేరళను తలపించేలా ఓనం వేడుక



ఓనం వేడుకల్లో విద్యార్థులు

పటాన్‌చెరు: ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఓనం వేడుకలను శుక్రవారం గీతం విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను గీతం స్టూడెంట్ లైఫ్‌లోని అన్వేషణ విద్యార్థి విభాగం మరో కేరళను తలపించేలా నిర్వహించింది. కేరళ సాంస్కృతిక సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది సమావేశం కావడంతో ప్రాంగణమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా గీతం కేఫ్‌లో వడ్డించిన సాంప్రదాయ ఓనం సద్య, వివిధ రకాల ప్రామాణికమైన రుచికరమైన వంటకాలతో కూడిన గొప్ప శాఖాహార విందుతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం కేరళ సంప్రదాయాల ఉత్సాహం, కళాత్మకత, సమగ్రతను ప్రదర్శించే సాంస్కృతిక ప్రదర్శనలు, పండుగ కార్యకలాపాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి గీతం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్, వివిధ పాఠశాలల డైరెక్టర్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల పొట్టగొట్టిన కాంగ్రెస్

బీఆర్‌ఎస్ రాష్ట్రనాయకుడు గోవర్ధన్ రెడ్డి



ఆటో యూనియన్ జెండాను ఆవిష్కరించిన గోవర్ధన్ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): ఆటో డ్రైవర్ల బతుకులను కాంగ్రెస్ ఆగం చేసిందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం గుమ్మడిదల పట్టణ పరిధిలోని బీఆర్‌టీయూ మల్లికార్జున ఆటో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండాను ఆవిష్కరించారు. ఈ మేరకు పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఆటో యూనియన్ సభ్యులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆటో డ్రైవర్ల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు రూ.12 వేల అందిస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ పార్టీ తమకు అండగా ఉంటుందని, డ్రైవర్లందరికి త్వరలో బీమా సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, నాయకులు హనుమంత్ రెడ్డి, రాజశేఖర్, శ్రీనివాస్ రెడ్డి, ఆటో అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్, సభ్యులు అశ్వక్, ఖాన్, వెంకటేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



విద్యాసాగర్‌ను సన్మానిస్తున్న స్నేహితులు

సంగారెడ్డి: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన పోతిరెడ్డిపల్లి హెచ్‌ఎం విద్యాసాగర్‌ను చిన్ననాటి మిత్రులు శుక్రవారం కలిసి అభినందనలు తెలిపారు. సంగారెడ్డి గాంధీ సెంటినరీ పాఠశాలలో 10వ తరగతి వరకు చదివిన విద్యాసాగర్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందడం అదృష్టమని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనాథ్ కులకర్ణి, వ్యాపారవేత్త శశి కిరణ్, మదన్ మోహన్, విష్ణువర్ధన్ రెడ్డి, మధు సూధన్, ట్రాన్స్ కో విజిలెన్స్ ఏఈ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మాణిక్
- సీఐటీయూ ఆధ్వర్యంలో రెండో రోజు ఆందోళన

పటాన్‌చెరు టౌన్: కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాణిక్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో గల సువెన్ ఫార్మా పరిశ్రమ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు రెండో రోజు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని అడిగితే యాజమాన్యం పట్టించుకోకుండా మొండిగా వ్యవహరిస్తుందన్నారు. గత 20ఏళ్లుగా కార్మికులు పనిచేస్తున్న పర్మినెంట్ చేయలేదన్నారు. నేటికీ కాంట్రాక్ట్ కార్మికులుగానే కొనసాగిస్తూ తీవ్ర శ్రమ దోపిడీకి పాల్పడుతుందన్నారు. కార్మికులు ఐక్యంగా పోరాడి హక్కులు సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శాండ్విక్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పాండు రంగారెడ్డి, సువెన్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఉపాధ్యక్షుడు చంద్రయ్య, సహాయ కార్యదర్శి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి చంద్రకాంత్, కార్మికులు పాల్గొన్నారు.

భూదళారుల నుంచి అప్రమత్తంగా ఉండండి

కంగ్టి(నారాయణఖేడ్): భూదళారులు భూమి ఒక చోట ఉంటే మరో చోట చూపి కొనుగోలుదారులను మోసం చేస్తున్నట్లు సీఐ దమ్మ వెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కంగ్టి, కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో భూదళారుల నుంచి కొనుగోలుదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గతంలో రైతుల వద్ద సైతం పాస్‌బుక్‌లు తీసుకొని సంతకం చేయాలని మోసాలకు పాల్పడిన దళారులపై కేసులు నమోదైనట్లు గుర్తుచేశారు. చెరువులో మునిగిన భూములు, కొండలు, లోయల్లోని భూములు రోడ్డు పక్కన ఉన్నట్లు చెప్పి తక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు మోసాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. రైతులకు భూమి అమ్మే ఇష్టం లేకున్నా కొంత డబ్బులు ఇప్పించి అగ్రిమెంట్‌పై సంతకాలు తీసుకొని 25 శాతం అడ్వాన్స్ కాజేస్తున్నారన్నారు. తర్వాత రైతులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ఎలాంటి మోసాలకు పాల్పడిన ఎవరిని ఉపేక్షించేది లేదని సీఐ హెచ్చరించారు.

బాధిత మహిళలకు ఉద్యోగావకాశాలు

సంగారెడ్డి జోన్: పోక్సో, అత్యాచార కేసుల్లో బాధిత మహిళలతో పాటు వారి పిల్లలకు వృత్తి, విద్యా కోర్సులు, విద్యార్హతల ఆధారంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఎస్పీ సర్దార్ సింగ్ వెల్లడించారు. శుక్రవారం పట్టణంలోని భరోసా కేంద్రాన్ని సందర్శించారు. ఈ మేరకు వివిధ రకాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత మహిళలతో పాటు వారి పిల్లలకు చేయూతను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, వారి నైపుణ్యాభివృద్ధికి అనుగుణంగా శిక్షణ కల్పించి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ముత్యాలు, ప్రోగ్రాం మేనేజర్ రేంజి జోసెఫ్, కోఆర్డినేటర్ దేవ లక్ష్మి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.